# అసమ్మతి ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు
# అసమ్మతి ప్రగతికి ప్రేరణ

# మానవ హక్కుల వేదిక, నిజామాబాద్ జిల్లా 4వ మహాసభ

**శనివారం, జులై 29, 2017, ఉదయం: 10-30 గంటలకు**

**మర్హబా ఫంక్షన్ హాలులో, రాకాసిపేట, బోధన్, నిజామాబాద్ జిల్లా**

భూమి బల్లపరుపుగా ఉందన్నారు. సమాజం సమ్మతించింది. రాహువూ, కేతువూ సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మింగుతారన్నారు. గ్రహ శాంతులు చేస్తేనే బ్రతుకు లేకుంటే అంతా అల్లకల్లోలమేనన్నారు. విష్ణువు భుజస్కందాలపై భూమి నిలబడిందన్నారు. కాదు!. కాదు!!. హెర్క్యులస్ భుజాలపై అన్నారనుకోండి గ్రీకులు. ఈ మాటలన్నిటినీ సమాజంలో దాదాపు అందరూ సమ్మతించారు. అదిగో ఆయన్ని చూడండి. దీన్ని ఒప్పుకోవడానికి సిద్ధంగా లేడు. టెలిస్కోపుతో ఆడుకుంటున్నాడు. అతగాడు తన టెలిస్కోపును చంద్రుడివైపు తిప్పాడు, అరె... గమ్మత్తు..., అక్కడ మనిషి అదృశ్యమైపోయాడు, కొండలూ గుట్టలూ కనబడ్డాయి. తన టెలిస్కోపును ఇంకా ఇంకా తిప్పాడు, నక్షత్ర మండలం, గ్రహాలూ అన్నీ ఒక కక్ష్యలో తిరుగుతూ కనపడ్డాయి. ఆ ఒప్పుకోకపోవడమే అసమ్మతి. ఆ అసమ్మతి పేరే గెలీలియో. ఈ అసమ్మతే ఖగోళశాస్త్ర ఆవిర్భావానికి కారణమయింది. గ్రహాల, గ్రహణాల కథ వెల్లడైంది. అంటే ప్రగతికి సోపానం అసమ్మతి.

"సృష్టికర్త ఎంత గొప్పవాడు! ఎంత వైవిధ్య భరితమైన ప్రకృతినీ, జీవజాలాన్నీ సృష్టించాడు!! సృష్టి ఆదామును, అవ్వనూ ఆదియందు సృష్టించెను". ఈ మాటలకు సమాజం సమ్మతించింది. ఒక వ్యక్తికి అనుమానం వచ్చింది. సమాజంతో సమ్మతించలే. అతడిని పరిశోధన అతడిని పరిణామవాదం వైపు తీసుకుపోయింది. జీవజాలమంతా పరిణామ ఫలితమేగాని సృష్టికర్త మహత్తుకాదని తేలిపోయింది. భగవంతుడి ఉనికే ప్రశ్నార్థకమైపోయింది. సృష్టి కర్తను మతం సృష్టించిందనీ, పరిశోధన ఫలితం పరిణామం అనీ అర్థమయింది. ఈ అసమ్మతి పేరే డార్విన్. జీవ పరిణామ సిద్ధాంతానికి డార్విన్ అసమ్మతి సోపానమయింది.

రాజ్యాధికారం దైవదత్తమనీ, రాజు దైవాంశ సంభూతుడనీ, రాజు ఏ తప్పూ చేయడనీ, రాజే శాసనమనీ, రాజాజ్ఞధిక్కరణ దైవదూషణతో సమానమనీ, పెళ్ళిళ్ళు స్వర్గంలోనే నిర్ణయమవుతాయనీ చేయించిన ప్రచారానికి సమాజం

సమ్మతి తెలిపింది. ఇందులో ఏదో తిరకాసు ఉందనిపించింది ఓ లాయరుకి. ఈ సమ్మతి ఉత్పత్తి చేయబడిన సమ్మతిలా కన్పించింది. కోటూ, గౌనూ పక్కకు విసిరేసి అడవిబాట పట్టాడు. ఆటవికుల జీవన విధానాన్ని పరిశీలించాడు. వావివరసలు లేని సంబంధాలనుంచీ దంపతీవ్యవస్థకు స్త్రీ పురుష సంబంధాలు ఎదిగాయని గుర్తించాడు. ఆ అసమ్మతి పేరే హెన్రీ మోర్గాన్. మోర్గాన్ అసమ్మతి ప్రగతికి సోపానమయింది. సాంఘిక శాస్త్రం ఆవిష్కృతమైంది.

మోర్గాన్ అసమ్మతికి మరో అసమ్మతి తోడయ్యింది. సంపాదించిన ఆస్తికి వారసులను నిర్ధరించడానికే వివాహ వ్యవస్థను స్థిరపరిచారనీ, ఆస్తిని కాపాడుకోవడానికే రాజ్యం ఉనికిలోకి వచ్చిందనీ శాస్త్రీయంగా రుజువు చేసింది ఈ తోడైన అసమ్మతి. స్వల్ప ప్రజామోదం, బలప్రయోగంలనే రెండు అస్త్రాల సాయంతో రాజ్యం మనుగడ సాగిస్తుందనీ, రాజ్యం దైవ దత్తంలనే భావన, రాజు దైవాంశ సంభూతుడనే భావన ప్రజామోదాన్ని పొందడానికి పాలకులు కల్పించినవనీ ఈ అసమ్మతి ప్రకటించింది. ఈ అసమ్మతి పేరే ఫ్రెడరిక్ ఏంగెల్స్. దీంతో సరికొత్త రాజ్య సిద్ధాంతం ఆవిష్కృతమైంది.

వ్యవసాయానికి అవసరమైన పశువులను తినమరిగి, దేవుళ్ళను సంతృప్తి పరచడం కోసమే యాగాలు అని చెప్పిన వైదీకంపై ఓ గొంతు అసమ్మతి ప్రకటించింది. అహింసా మంత్రాన్ని పఠించింది. దు:ఖనివారణకు మార్గాన్ని ప్రతిపాదించింది. ఆ అసమ్మతి పేరే గౌతమ బుద్ధుడు.

బ్రిటిషు పెత్తనం నడిచిన చోట ఎక్కడా పొద్దుగూకేది కాదు. అన్ని ఖండాలలోనూ వాడికి వలసలున్నాయి. వలసపాలన పట్ల అసమ్మతి ప్రకటించింది ఓ గొంతు. తెల్లవాడు పెడచెవిన పెట్టాడు అన్ని వినతుల్నీ. 'క్విట్ ఇండియా' అని అరిచింది ఆ గొంతు. లక్షల గొంతుల నినాదమైంది అది. బ్రిటీషువాడు ఇండియా వదిలేశాడు. అర్థ దిగంబర ఫకీరు అని ఒకనాడు బ్రిటీషువాడి హేళనకు గురైన ఆ అసమ్మతివాది జాతిపిత అయ్యాడు. ఆయనే గాంధీ.

గాంధీ వాదంలోని సామాజిక కోణంలో ప్రగతి వ్యతిరేకత ఉందనీ, గాంధీవాదం వర్ణాశ్రమ ధర్మానికి లోబడి మాత్రమే పనిచేస్తుందనీ, ఈ వర్ణ ధర్మమే ప్రజలను కులాలుగా విడదీసిందనీ, కుల విభజనకు సాధికారిత కల్పిస్తున్న ధర్మశాస్త్రాలను గాంధీవాదం పన్నెత్తుమాట కూడా అనడంలేదనీ, కుల విభజన అంతమైతే గానీ సామాజిక ప్రగతి సాధ్యంకాదనీ, ఈ నిచ్చెనమెట్ల కుల సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు అధికారంలోకి రావాలంటే వారికి ప్రత్యేక ఏర్పాట్లు అవసరమంటూ గర్జించిందో అసమ్మతి స్వరం. గాంధీ

అడుగుతున్న స్వాతంత్ర్యంలో దళితులు సోదిలోకి కూడా లేకుండా పోతున్నారని అనిందిి ఆ అసమ్మతి స్వరం. దళితులకు ప్రత్యేక ఏర్పాట్లు రిజర్వేషన్ల రూపంలో కట్టబెట్టేంత వరకూ విశ్రమించలే ఆ అసమ్మతి. దాని పేరే బి.ఆర్. అంబేడ్కర్.

గాంధీ వాదం సంపన్న వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టి యథాతథ స్థితిని మరో రూపంలో కొనసాగిస్తుందిగానీ, శ్రమ దోపిడీ లేని వ్యవస్థను, మనిషిని మరో మనిషి దోచుకోవడానికి అవకాశం లేని ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పర్చజాలదనీ, గాంధీవాదంలో శ్రామికులకు ప్రయోజనం కల్గించేది ఏమి లేదని మరో అసమ్మతి గొంతుక గొంతెత్తి అరిచింది. తెల్లవాడితో గాంధీవాదం రాజీపడుతోంది అనింది ఈ గొంతుక. దేశస్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసమే తమ ఆరాటమంతా అని గొంతులు పిక్కటిల్లేలా అరిచింది. వినవలసిన వాళ్ళు విననట్లు నటిస్తోంటే సెంట్రల్ అసెంబ్లీలో ఎవ్వరికీ హాని కలగని రీతిలో బాంబులు పేల్చి నిద్రమత్తు వదిలించింది. "ఇంక్విలాబ్ జిందాబాద్" అంటూ నినదించింది ఈ అసమ్మతి గొంతుక. గాంధీ వాదానికి ప్రత్యామ్నయం సోషలిజమేనంది. లెనిన్ జీవిత చరిత్రను చదవడం ముగించి ఉరికంబమెక్కిన ఆ అసమ్మతి పేరే భగత్‌సింగ్.

దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు జీవించే హక్కుతో సహా ఏ ప్రాథమిక హక్కునూ అనుభవించనీయకుండా తాను ప్రజలను నియంత్రించవచ్చునంది ప్రభుత్వం. నియంతృత్వ పాలన నడుస్తున్న 1975-77 సంవత్సరాల మధ్యకాలం అది. జీవించే హక్కుకూడా రాజ్యాంగం ఇచ్చిన హక్కేనంది ప్రభుత్వం. విస్తుపోయింది అసమ్మతి. సవాలు చేసింది సుప్రీంకోర్టులో. సుప్రీంకోర్టు ప్రభుత్వ వాదనతో సమ్మతించింది. దీన్నే హెబియస్ కార్పస్ కేసు అంటారు. ధర్మాసనంలో ఒకే ఒక్క గొంతుక అసమ్మతి ప్రకటించింది. జీవించే హక్కు రాజ్యాంగం ఇచ్చిన హక్కు కాదంది ఆ అసమ్మతి. పుట్టుకతో సంక్రమించిన ఈ హక్కును రాజ్యాంగం తనలో చేర్చుకుని తనకు తాను గౌరవించుకుంది అని చెప్పింది. లోకం తలకిందులు కావచ్చుగాక, జీవించే హక్కు మాత్రం సదా జీవించే ఉంటుంది అంది ఆ అసమ్మతి. ఆ అసమ్మతి పేరే జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా. ఖన్నా అభిప్రాయమే రాజ్యాంగ 44 వ సవరణగా పరిణమించింది.

హక్కుల ఉద్యమంలోని అసమగ్రత, అస్వతంత్రత, విశాల స్వభావ లోపమూ, ఆచరణలోని అసమతుల్యతలూ తీవ్ర మేధో మధనానికి దారితీసాయి. హక్కుల ఉద్యమం ఏ ఒక్క రాజకీయ అభిప్రాయానికో పరిమితం కాకూడదు అన్నదో అసమ్మతి స్వరం. ఉద్యమాలు ప్రజాతంత్ర విలువలకు కట్టబడి

వుండాలని అనింది ఆ అసమ్మతి. హక్కుల ఉద్యమ అవగాహనలోనూ ఆచరణలోనూ వైరుధ్యముండకూడదనింది. హక్కుల ఉద్యమం ఇతర ఉద్యమాలకు కవచంగా పనిచేయడం కాదనీ, దానికో స్వతంత్ర ఆచరణ, తాత్విక దృక్పథమూ ఉండాలనింది ఆ అసమ్మతి. ఆ అసమ్మతి పేరే బాలగోపాల్. ఆ ఆసమ్మతి రూపమే మానవ హక్కుల వేదిక.

**మిత్రులారా!**

మానవాళి పురోగమనంలోని ప్రతి దశలోనూ అసమ్మతే చరిత్ర పురోగమనానికి దోహదపడింది. అసమ్మతి పరిశోధననూ, సత్యాన్వేషణనూ ప్రోత్సహించింది. ప్రతి చారిత్రక అసమ్మతీ చరిత్రను ఒక గెంతు గెంతించింది. ప్రజలకు కొత్త ఆలోచనను అందించింది. అప్పటి వరకూ గల నమ్మకాలలోని హేతురాహిత్యాన్ని ఎండగట్టింది.

మరి అసమ్మతి వాదులను ఏమి అనలేదా? గెలీలియోను ఇంట్లోనే బంధించి ఇంట్లోనే మరణించేటట్లు చేసింది. అయినా అసమ్మతి ఆగలే. సత్యాన్ని బోధించే హక్కు ఉంది అన్న సోక్రటీస్‌కు మరణ శిక్ష విధించింది. అయినా అసమ్మతి నిస్తేజమవ్వలే. బౌద్ధాన్ని ఎదుర్కోలేక బుద్ధుడ్ని దశావతారాల్లో ఒకణ్ణి చేసారు. భగత్‌సింగ్ ను ఉరితీశారు అయినా అసమ్మతి ఆగలే. వీరంతా అసమ్మతి పతాకను సమున్నతంగానిలబెట్టిన వాళ్ళు. అసమ్మతి తెలపాల్సిన చోట అసమ్మతిని తెలపకపోతే అది నేరంతో సమానం. అసమ్మతి హక్కు మాత్రమే కాదు. అది మన విధి అని నమ్ముతుంది మానవ హక్కుల వేదిక. అసమ్మతి హక్కును మనం కాపాడుకోవాలి. అందుకే దుర్మార్గపు హిందుత్వ రాజకీయాల నుంచీ, విధ్వంసకర అభివృద్ధి నమూనా వరకూ అన్ని అప్రజాస్వామిక, అన్యాయ చర్యలపైనా మా అసమ్మతి తెలుపుతున్నాం. మా అసమ్మతికి మీ సమ్మతి తెలపాల్సిందిగా కోరుతున్నాం. నిరంతర జాగరూకతే స్వేచ్ఛకు మనం చెల్లించే మూల్యం.

**ఈ మహాసభలో ...**

| | | |
|---|---|---|
| మానవహక్కుల వేదిక అధ్యక్షుడు | : | **ఎస్. జీవన్ కుమార్** |
| ప్రధాన కార్యదర్శి | : | **వి.ఎస్. కృష్ణ** |
| ఉపాధ్యక్షుడు | : | **గొర్రెపాటి మాధవరావు** |
| కార్యదర్శి | : | **మోహన్ (నల్లగొండ)** |

**మరియు సంస్థ సభ్యులు, మీరూ పాల్గొంటున్నారు.**

**మానవ హక్కుల వేదిక, నిజామాబాద్ జిల్లా శాఖ**